RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 263 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 18-4-2026 | Pages: 8 | R2/-

సంపుటి : 17 | సంచిక : 263 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 18-4-2026 | పేజీలు : 8 | రూ2/-



## స్వచ్ఛాంధ్రపై సీఎం చంద్రబాబు సమీక్ష...

# అధికారులకు కీలక ఆదేశాలు

**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పురోగతిపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమావేశం**

**100 శాతం ఇంటింటి చెత్త సేకరణ, శుద్ధి జరగాలని ఆదేశం**

**అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం**

**హాస్టళ్లలో తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రత్యేక మార్గదర్శకాలు**


**పచ్చదనం పెంపు, సోలార్ రూఫ్‌టాప్‌లపై దృష్టి సారించాలని సూచన**

**అమరావతి, సిటిజన్ టైమ్స్**



'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమ పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య

తరువాయి 2లో..




# వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లోక్‌సభలో ఊహించని, భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు శుక్రవారం సభలో వీగిపోయింది. లోక్‌సభ స్థానాలను పెంచడంతో పాటు, చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన ఈ బిల్లు, అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైంది. రెండు రోజుల పాటు జరిగిన వాడీవేడి చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. సాధారణ మెజారిటీ లభించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు తప్పనిసరి అయిన ప్రత్యేక మెజారిటీని పొందలేకపోవడంతో బిల్లు ఓటమి పాలైంది. ఈ బిల్లు ద్వారా లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలను 850కి పెంచాలని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేశాక ఈ పెంపును అమలు చేయాలని ప్రభుత్వం

> **రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు**
> **బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు**
> **మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు**
> **రాజ్యాంగ సవరణ బిల్లు.. ఎన్డీఏకు ఆ బలముందా?**

ప్రతిపాదించింది. దీనితో పాటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. బిల్లుపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా బలంగా తమ వాదనలు వినిపించారు. ఓటర్లు, ప్రజాప్రతినిధుల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమానతను సరిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్షాల వైఖరిని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అడ్డుకుంటూ వస్తోందని, ఇప్పుడు కూడా అదే పనిచేస్తోందని అమిత్ షా ఆరోపించారు. అయితే, ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా సాధికారత అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఎత్తుగడకు పాల్పడుతోందని విమర్శించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దక్షిణాది రాష్ట్రాల గొంతును అణచివేసే ప్రయత్నమే ఈ

తరువాయి 2లో..

## ప్రధానికి, నాకు ఆ సమస్య లేదు

# సభలో నవ్వులు పూయించిన రాహుల్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

మహిళా రిజర్వేషన్ సహా మూడు బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశానికి మహిళలే చోదకశక్తి అని అభివర్ణించిన ఆయన.. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో మహిళల

తరువాయి 2లో..

# ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

తరువాయి 2లో..






# ఇరాన్ డ్రోన్లపైకి అమెరికా 'తేనెపిట్టలు'

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్‌తో యుద్ధం తొలినాళ్లలో భారీగా సైనిక నష్టాన్ని చవిచూసిన అమెరికా.. కాస్త ఆలస్యంగానైనా దాన్నుంచి తేరుకుంది. ఇరాన్ షాహెద్ డ్రోన్లకు విరుగుడుగా 'మెరోప్స్' ఇంటర్‌సెప్టర్ డ్రోన్లను రంగంలోకి దించింది. ఈ విషయాన్ని తాజాగా అమెరికా సైనిక కార్యదర్శి డేనియల్ డ్రిస్కాల్ తమ దేశ కాంగ్రెస్ ఎదుట వెల్లడించారు. ఇతర ఇంటర్‌సెప్టర్ వ్యవస్థలతో పోలిస్తే చాలా చౌకగా

తరువాయి 2లో..

## సమయం ఆసన్నమైంది..

# ఆలోచించి నిర్ణయం తీసుకోండి

### రాజకీయ పక్షాలకు మోదీ విన్నపం



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై శుక్రవారం ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రధాని

తరువాయి 2లో..

# మీకు మహిళల ఉసురు తగులుతుంది

**విపక్షాలపై అమిత్ షా ఫైర్**

**లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు తిరస్కరణ**

**విపక్షాల వల్లే బిల్లు వీగిపోయిందని అమిత్ షా ఆరోపణ**

**కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలపై ఆగ్రహం**

**ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు.

తరువాయి 2లో..



With Deep Sorrow...

We regret to inform you of the demise of our beloved

SRI RUDRA SANKARA RAO GARU

(Retired Reserve Inspector, 3rd APSP, Kakinada)

Date of Birth : 10-11-1952



Date of Death : 07-04-2026

Rituals Ceremony (Pedda Karma)

Date: Saturday, April 18

Venue:

#3-267, Ramana Rao Nagar, Pansapadu, Kakinada.

Location Coordiantes :

17.016083, 82.234659

## ఎడిటోరియల్

# మంత్రి వర్గ విస్తరణ... క్లారిటీ వచ్చినట్లేనా ?

ఏపీలో రాజకీయం చకచకా మారుతోంది. కూటమికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ తనదైన కార్యాచరణతో ముందుకు సాగుతోంది. పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలను టీడీపీ తీసుకుంది. ఎంతో కాలంగా ఊరిస్తూ వస్తున్న పార్టీ జాతీయ రాష్ట్ర కమిటీలను పూర్తి చేసింది. లోకేష్ కి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి అని గత మహానాడులోనే ఊహాగానాలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. కానీ ఈసారి మహానాడుకు ముందుగానే ఆ ప్రక్రియను పూర్తి చేశారు. దాంతో ఒక విధంగా పార్టీ బాధ్యతలను లోకేష్ చేతిలో పెట్టినట్లు అయింది. దీంతో ఈసారి మహానాడుకు లోకేష్ కొత్త బాధ్యతలతో అడుగు పెడతారు అని అంటున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆయన పాల్గొనే తొలి మీటింగ్ ఇదే కాబోతోంది. ఆ విధంగా టీడీపీ మీద పూర్తి పట్టుని సాధించేందుకు ఈ కీలక సమావేశం లోకేష్ కి ఎంతగానో ఉపయోగపడుతుంది అని అంటున్నారు. ఇక మహానాడు తరువాత జూన్ నెలలో టీడీపీ కూటమి రెండేళ్ల పాలన పూర్తి అవుతుంది. దాంతో మంత్రి వర్గ విస్తరణ కూడా సరైన ముహూర్తం పెట్టుకుని చేస్తారు అని అంటున్నారు. పార్టీ పదవుల విషయంలో అనుసరించిన కూర్పుతోనే మంత్రి వర్గ విస్తరణలోనే మార్పులు చేస్తారు అని అంటున్నారు. ఎక్కువ మంది యువతకు పార్టీలో ప్రాధాన్యత కల్పించారు. దాంతో ఇదే వరసలో ప్రభుత్వంలోనూ యువతకు కొత్త వారికి అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు అని అంటున్నారు. అయితే ఇప్పటికే కూటమి మంత్రులలో మెజారిటీ కొత్త వారే ఉన్నారు. అరడజన్ లోపే సీనియర్ మంత్రులు ఉన్నారు. కానీ ఈసారి చేసే మార్పులలో కొత్త వారు అంటే ప్రభుత్వం గురించి మరింత ధాటీగా జనంలోకి తీసుకుని వెళ్ళే వారిని తీసుకుంటారు అని అంటున్నారు. అదే విధంగా మంత్రుల పనితీరు ఆధారంగా కొంతమంది సీనియర్లు జూనియర్లకు కూడా స్థాన చలనం ఉంటుందని అంటున్నారు. టీడీపీ కమిటీలను చూసిన వారికి అయితే ఒక విషయం అర్థం అయిపోయింది. పార్టీ పదవులు అయినా మంత్రి పదవులు అయినా కొత్త వారికే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. టీడీపీ మీద తనదైన ముద్రను బలంగా వేసిన లోకేష్ ప్రభుత్వంలో మార్పులు జరిగితే అక్కడా తన మార్క్ చూపిస్తారు అని అంటున్నారు. అయితే మంత్రి వర్గ విస్తరణ భారీ స్థాయిలో ఉంటుందా లేదా మూడు నాలుగు పదవులతో భర్తీ చేసి అక్కడితో ముగిస్తారా అన్నది అయితే తేలాల్సి ఉంది. ఒక్కటి మాత్రం వాస్తవం అంటున్నారు. గతంలో జగన్ చేసినట్లుగా మొత్తానికి మొత్తం మంత్రులను మార్చేసి కొత్త వారిని తీసుకోవడం జరగదని కొద్ది మందినే మార్చి అనుకున్న విధంగా మంత్రి వర్గం కసరత్తుని ముగిస్తారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే టీడీపీ కమిటీల ప్రకటన తర్వాత అందరి చూపు మంత్రి వర్గ విస్తరణ మీదనే ఉంది. మరి ఆ ముహూర్తం ఎపుడు ఏమిటి అన్నదే వేచి చూడాల్సి ఉంది.

# వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

బిల్లు అని విపక్షాలు ఆరోపించాయి. ఈ కీలక బిల్లు ఓటమి పాలవడంతో, దీనితో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా కోటాను విస్తరించే సవరణ బిల్లులను కూడా ముందుకు తీసుకువెళ్లబోమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ ఓటమి మోదీ ప్రభుత్వ శాసనపరమైన రికార్డులో ఒక అరుదైన వైఫల్యంగా నిలిచిపోతుంది. అదే సమయంలో, తమ వాదనకు విజయం లభించిందని ప్రతిపక్షాలు భావిస్తున్నప్పటికీ, చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆశిస్తున్న మహిళలకు మాత్రం రిజర్వేషన్ల కోసం నిరీక్షణ మరింత పెరిగింది. ఈ పరిణామంతో మహిళా రిజర్వేషన్ల భవిష్యత్తు మళ్లీ అనిశ్చితిలో పడింది.

మహిళలకు 2029 నుంచి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీని ఎన్డీఏ సాధించలేకపోవడంతో బిల్లు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ క్రమంలో మిగతా రెండు బిల్లులు..డీలిమిటేషన్ బిల్లు–2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు–2026లను వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఈ బిల్లులు రాజ్యాంగంపై దాడి చేయడమే. రాజ్యాంగ విరుద్ధమైన బిల్లులను ఓడించాం. ఇది మహిళా బిల్లు కాదని స్పష్టంగా చెప్పాం. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం వ్యతిరేకం కాదు. మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బిల్లు ముమ్మాటికీ మహిళా బిల్లు కాదు. ఇది భారత రాజకీయ నిర్మాణంపై దాడి. దేశ రాజకీయ నిర్మాణాన్ని మార్చే కుట్రను అడ్డుకున్నాం. 2023 మహిళా బిల్లును ఆమోదించేందుకు సిద్ధమని ప్రధానికి చెబుతున్నా. 2023 మహిళా బిల్లును అమలు చేయండి.. పూర్తిగా సహకరిస్తాం. – రాహుల్ గాంధీ

ఈ పద్ధతిలో మహిళా బిల్లును పెట్టడాన్ని వ్యతిరేకించాం – ప్రియాంకా గాంధీ

దిల్లీని ఓడించాం – తమిళనాడు సీఎం స్టాలిన్

రాహుల్, ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఈ రోజు గుర్తుండిపోతుంది. – తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

**రాజ్యాంగ సవరణ బిల్లు.. ఎన్డీఏకు ఆ బలముందా?**

దిల్లీ: కేంద్రం తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, యూటీ చట్టాల సవరణ బిల్లులపై మరికాసేపట్లో లోక్‌సభలో ఓటింగ్ జరగనుంది. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉంది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగిస్తారు. అనంతరం ఈ బిల్లులపై ఓటింగ్ జరగనుంది.

# ఇరాన్ షాహెద్ డ్రోన్లకు పోటీగా అమెరికా 'తేనెపిట్టలు'..!

లభించే ఈ 'తేనెపిట్టలు'.. అగ్రరాజ్యం (ఖూూ)పై యుద్ధ భారాన్ని భారీగానే తగ్గించాయట..! ఇరాన్‌తో యుద్ధం మొదలైన దాదాపు వారం రోజుల్లో తాము 13 వేల 'మెరోప్స్'ను తయారీ కంపెనీల నుంచి కొనుగోలు చేసినట్లు కాంగ్రెస్ విచారణలో డేనియల్ వెల్లడించారు. "ఇవి చాలా అద్భుతంగా పని చేస్తున్నాయి. ప్రస్తుతం వీటి ధర 15 వేల డాలర్ల వరకు (సుమారు రూ.13 లక్షలు) ఉంది. ఎక్కువ మొత్తంలో కొంటే ఇంకా తక్కువ ధరకే లభిస్తాయి. దాంతో షాహెద్ డ్రోన్లను కూల్చేందుకు మాకు 30 వేల డాలర్ల నుంచి 50వేల డాలర్ల లోపే ఖర్చవుతుంది. దీనివల్ల వ్యయాన్ని చాలావరకు తగ్గించుకుంటున్నాం" అని అమెరికా సైనిక కార్యదర్శి తెలిపారు. తొలుత వీటిని ఉక్రెయిన్‌లో వినియోగించగా.. మంచి ఫలితాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దాదాపు నెల క్రితమే 10,000 'మెరోప్స్' డ్రోన్లను పశ్చిమాసియాకు తరలించినట్లు తెలిపారు. వాస్తవానికి ఇరాన్ షాహెద్ డ్రోన్లను అడ్డుకునేందుకు తొలుత అమెరికా 'పేట్రియాట్' వంటి ఖరీదైన క్షిపణులను వినియోగించాల్సి వచ్చింది. వీటి ధర రూ.కోట్లల్లో ఉండటంతో ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఇక, 'కోయోట్' లాంటి డ్రోన్ ఇంటర్‌సెప్టర్లు అమెరికా వద్ద ఉన్నా.. 'మెరోప్స్'తో పోలిస్తే వాటి ధర దాదాపు 10 రెట్లు ఎక్కువగా ఉంది. దీంతో ఖర్చు భారాన్ని దృష్టిలోఉంచుకొని అగ్రరాజ్యం 'మెరోప్స్'ను కొనుగోలు చేసింది. అయితే, వీటిలో ఎన్నింటిని పశ్చిమాసియాలో ఉపయోగించారు? ఇవి ఎన్ని షాహెద్ డ్రోన్లను కూల్చేశాయన్న వివరాలను మాత్రం డేనియల్ వెల్లడించలేదు.

**ఏంటీ 'మెరోప్స్'..?**

'మెరోప్స్' అనేది ఏఐ ఆధారిత యాంటీ డ్రోన్ వ్యవస్థ. యూఎస్ 'ప్రాజెక్ట్ ఈగల్'లో భాగంగా వీటిని అభివృద్ధి చేశారు. ఇవి చిన్న సైజులో ఉండటంతో పికప్ ట్రక్కు వెనకాల సులువుగా వీటిని అమర్చుకోవచ్చు. షాహెద్ లాంటి వన్‌వే అటాక్ డ్రోన్లను ఇవి సమర్థవంతంగా అడ్డుకోగలవు. వీటిల్లోని ప్రొపెల్లర్ ఆధారిత సర్వేయర్లు మూడు అడుగుల పొడవు ఉంటాయి. ఇవి గంటకు 175 మైళ్ల వేగంతో ప్రయాణించగలవు. ఈ సర్వేయర్లు పేలుడు పదార్థాలను మోసుకెళ్లి.. ప్రత్యర్థి డ్రోన్లను నేరుగా ఢీకొట్టి పేల్చేస్తాయి. లేదా ఆ డ్రోన్లపై బాంబులను ప్రయోగించి వాటిని కూల్చేస్తాయి. శాటిలైట్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ వ్యవస్థలు అందుబాటులో లేని సమయంలో కృత్రిమ మేధ సాయంతో మెరోప్స్ ప్రయాణించి లక్ష్యాన్ని ఛేదిస్తాయి. ఇవి ఆటోమేటెడ్ విధానంలోనూ పనిచేయగలవు. లేదా ఆన్‌బోర్డు సెన్సర్లను ఉపయోగించి రిమోట్‌గా వీటిని ప్రయోగించే వీలుంటుంది. వాస్తవానికి 'మెరోప్స్' అంటే తేనెటీగలను తినే చిన్న రంగురంగుల పిట్ట. దీన్ని 'తేనెపిట్ట' అని పిలుస్తారు. దీని పేరు మీదుగానే ఈ యాంటీ డ్రోన్ ఆయుధ వ్యవస్థకు 'మెరోప్స్' అని పేరు పెట్టినట్లు సమాచారం.

# మీకు మహిళల ఉసురు తగులుతుంది

బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు. ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు.

## మొదటి పేజీ తరువాయి

స్వచ్ఛాంధ్రపై సీఎం చంద్రబాబు సమీక్ష...

# అధికారులకు కీలక ఆదేశాలు

నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల్లో అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్లను నిర్మించాలని సీఎం సూచించారు. ఇంటింటికీ వెళ్లి 100 శాతం చెత్త సేకరణ జరగాలని, సేకరించిన చెత్తను శాస్త్రీయంగా శుద్ధి చేసే ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్దేశించారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో తడి, పొడి చెత్త నిర్వహణ, పరిశుభ్రమైన వంటగదుల నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు, నెట్ జీరో సాధన, పచ్చదనం పెంపు వంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి. నారాయణ, పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ కమిషనర్ సంపత్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రధానికి, నాకు ఆ సమస్య లేదు సభలో నవ్వులు పూయించిన రాహుల్

నుంచి ఎంతో నేర్చుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, తనకు 'భార్య సమస్య' లేదంటూ సరదాగా చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. "సభలో ఉన్న మనమంతా.. మన జీవితాల్లో తల్లి/సోదరి/భార్య నుంచి ఎంతో తెలుసుకున్నాం.. నేర్చుకున్నాం.. ప్రభావితులమయ్యాం" అని రాహుల్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మాదిరిగా తాను తన భార్య కోసం కవిత రాయనందుకు ఇంట్లో తిట్లు తిన్నానంటూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు (ఖఱతీవఅ =ఱఎఱఎబ) సరదాగా చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "వాస్తవానికి.. ప్రధానికి, నాకు ఆ సమస్య లేదు" అని సరదాగా వ్యాఖ్యానించారు. లోక్‌సభలో మహిళా బిల్లులపై ప్రియాంకా గాంధీ (ూతీఱఎఖఅఖ +ఖఅస్త్రఱ) చేసిన ప్రసంగాన్ని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ప్రశంసించారు. తన 20ఏళ్ల రాజకీయ జీవితంలో తాను చేయని పనిని (అమిత్ షాను నవ్వించడాన్ని).. తన సోదరి ఐదు నిమిషాల్లో సాధించారని రాహుల్ గాంధీ చెప్పడంతో సభలో సభ్యులంతా చిరునవ్వులు చిందించారు.

# ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**


కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025–26 సీజన్ కు గాను యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు.


# సమయం ఆసన్నమైంది.. ఆలోచించి నిర్ణయం తీసుకోండి

నరేంద్ర మోదీ (ూవీ వీశీఱ) 'ఎక్స్' వేదికగా కీలక విజ్ఞప్తి చేశారు. కాసేపట్లో లోక్‌సభలో ఓటింగ్ జరగనుందని, అన్ని రాజకీయ పక్షాలూ తగిన పరిశీలన అనంతరం మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా ఓటు వేయాలని కోరారు. "నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. కాసేపట్లో లోక్‌సభలో ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి" అని ప్రధాని కోరారు. "నారీశక్తి మనోభావాలు దెబ్బతినేలా ఏమీ చేయొద్దని సభ్యులందరినీ కోరుతున్నాను. మీ ఇంట్లోని అమ్మ, సోదరి, కుమార్తె, భార్యను మనసులో తలచుకుని, మీ అంతరాత్మ చెప్పేది విని ఓటేయండి. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం" అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

# డ్రోన్ కెమెరాలతో నేరాలపై శ్రీకాకుళం పోలీసుల కట్టుదిట్టమైన నిఘా







**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 17**

జిల్లాలో నేరాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ శ్రీకాకుళం పట్టణ, రూరల్ మరియు ఆముదాలవలస పోలీస్ స్టేషన్ల పరిధిలోని శివారు, నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం ఈ డ్రోన్ నిఘా కార్యక్రమం చేపట్టారు. ప్రజల రాకపోకలు తక్కువగా ఉండే ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టే దిశగా ఈ చర్యలు చేపట్టారు. డ్రోన్ కెమెరాల ద్వారా అనుమానాస్పద కదలికలను గుర్తించి, వెంటనే పోలీసు సిబ్బంది స్పందించే విధంగా చర్యలు అమలు చేస్తున్నారు. ఈ చర్యల ద్వారా నేరాలపై కట్టుదిట్టమైన నియంత్రణ సాధించడంతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని జిల్లా పోలీసు శాఖ సూచించింది.

# ఇళ్లు, రోడ్లు, పెన్షన్లపై ప్రజల ఫిర్యాదులు

## పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే వంశీ కృష్ణ





**జగదాంబ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :17**

విశాఖ దక్షిణ నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ సూర్యాబాగ్ జోన్–4 కార్యాలయం (జగదాంబ థియేటర్ వెనుక)లో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అధికార యంత్రాంగం ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. ప్రజలు ప్రధానంగా ఇళ్ల మంజూరు, రహదారులు, డ్రైనేజీ, సామాజిక పెన్షన్లు వంటి మౌలిక సదుపాయాల సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. పాత నగర ప్రాంతం కావడంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. త్వరలోనే కొత్త పెన్షన్లు, గృహాల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. వెంకటేశ్వర మెట్ట దేవస్థాన భూముల సమస్య నియోజకవర్గంలో ప్రధాన అంశమని, ప్రజల చిరకాల కోరిక అయిన ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు, ఎన్నికల అనంతరం ప్రకటించిన పనులను కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే రెండు నుండి మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. అదేవిధంగా, 35వ వార్డు పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో వాకర్స్‌పై యూజర్ ఛార్జీల వసూళ్లపై వచ్చిన ఫిర్యాదులను గమనించినట్లు తెలిపారు. ఈ విషయంపై అధికారులతో చర్చించి, గతంలో ఉన్న విధానాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# పాడేరు కలెక్టరేట్‌లో రెవెన్యూ సిబ్బందిపై సమీక్ష

### సమయపాలన తప్పనిసరి – నిర్లక్ష్యంపై కఠిన చర్యలు : కలెక్టర్ టి.నిషాంతి



**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :17**

అల్లూరి సీతారామరాజు,జిల్లా పాడేరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ టి.నిషాంతి రెవెన్యూ సిబ్బంది పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణ, కార్యాలయ సమయపాలన, పెండింగ్ సమస్యల పరిష్కారంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయ సమయపాలనను కచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యానికి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు. భూమి రికార్డులు, మ్యుటేషన్లు వంటి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్ కేసులను అనవసరంగా నిల్వ ఉంచకుండా వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నిర్దిష్ట గడువులో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. విధుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలన్నారు.

## ఇంటర్ విద్యార్థి

# ఆత్మహత్య

### – తక్కువ మార్కుల కారణంగా విషాదం



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :17**

ఆనందపురం మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆశించిన దానికంటే తక్కువ మార్కులు రావడంతో మనస్తాపానికి గురైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బైరిపురం గ్రామానికి చెందిన లోకినిండి తారక్ రావు (18) ఆనందపురంలోని శ్రీ భవిష్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అతను 441 మార్కులు సాధించాడు. అయితే ఆశించిన స్థాయిలో మార్కులు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురైనట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున సుమారు 5:20 గంటల సమయంలో కళాశాల తరగతి గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తువాలాతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో కళాశాలలో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుని తండ్రి భగీరథి (45) ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ సి.హెచ్. వాసు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ సందర్భంగా సీఐ వాసు నాయుడు మాట్లాడుతూ, పరీక్ష ఫలితాల కారణంగా విద్యార్థులు నిరాశకు లోనవ్వకూడదని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు ధైర్యం చెప్పాలని, ఏ సమస్య వచ్చినా వారితో మాట్లాడాలని కోరారు. విద్యార్థుల ప్రాణాల కంటే మార్కులు ముఖ్యమేమికాదని ఆయన స్పష్టం చేశారు.

## అల్లవరం హై స్కూల్ స్థలాన్ని ఆక్రమించి షెడ్ నిర్మాణం

**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

మండలం లోని అల్లవరం హై స్కూల్ స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేశారు ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



# విశాఖ రేంజ్‌లో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం : ఐజీ గోపీనాథ్ జట్టి

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :17**




విశాఖపట్నం రేంజ్ పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలనపై రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి ఐపీఎస్ అధ్యక్షతన శుక్రవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల ఎస్పీలు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం "సంకల్పం 2.0, చైతన్యం 2.0, అభ్యుదయం 2.0" కార్యక్రమాల కింద 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి కేసుల్లో నిందితుల అక్రమ ఆస్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకు 19 కేసుల్లో 18 మంది నిందితులపై సుమారు 11.63 కోట్ల విలువైన ఆస్తులను ఫ్రీజ్ చేసి అటాచ్ చేసినట్లు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాలో పాల్గొన్న 114 మందిపై పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం కింద చర్యలు ప్రతిపాదించి, అందులో 32 మందిని జైలుకు పంపినట్లు తెలిపారు. నేర నిరూపణలో కూడా విశాఖ రేంజ్ పోలీసులు గణనీయ పురోగతి సాధించినట్లు పేర్కొంటూ, జూన్ 2024 నుంచి ఏప్రిల్ 2026 వరకు 72 కేసుల్లో 129 మందికి శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, అలవాటు నేరస్తులపై పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవగాహన కార్యక్రమాల పరంగా "సంకల్పం" కార్యక్రమం కింద 27,527 కార్యక్రమాలు నిర్వహించి 18.41 లక్షల మందిని చైతన్యపరిచినట్లు తెలిపారు. 20,524 గ్రామాలు, పట్టణాలు మరియు 8,761 విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించగా, 7.72 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కరపత్రాల పంపిణీ, ఈగల్ క్లబ్బుల ఏర్పాటు, డ్రాప్ బాక్సుల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టారు. సాంకేతిక వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఖోజ్, నిదాన్, నాట్‌గ్రిడ్ వంటి యాప్‌లు మరియు 38 డ్రోన్ల సహాయంతో గంజాయి రవాణా, సాగును గుర్తిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో డ్రోన్ల సర్వేలు నిర్వహించి అటవీశాఖతో కలిసి గంజాయి పంటలను నిర్మూలించాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారులు, తీరప్రాంతాల్లో నిఘా బలోపేతం చేయాలని సూచించారు. 100 రోజుల కార్యాచరణను ఐదు దశల్లో అమలు చేస్తామని తెలిపారు. ప్రారంభ దశలో ప్రజా సమీకరణ, తరువాత అమలు చర్యలు, గ్రామీణ, గిరిజన విస్తరణ, యువతలో అవగాహన, చివరిగా పటిష్టత దశలుగా కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో అరెస్టు అనంతరం 60 రోజుల్లోపు చార్జ్ షీట్లు దాఖలు చేయాలని, అక్రమ ఆస్తుల స్వాధీనం, ఆర్థిక లావాదేవీల ట్రాకింగ్‌పై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారిని గుర్తించి డీ–అడిక్షన్ కేంద్రాల ద్వారా చికిత్స అందించాలని, వారి కుటుంబాలకు కౌన్సెలింగ్ కల్పించాలని సూచించారు. యువత భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు కళాశాలల్లో "సంకల్ప క్లబ్బులు" ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ముగిసే నాటికి విశాఖ రేంజ్‌లో 1000 కంటే ఎక్కువ డ్రగ్ ఫ్రీ గ్రామాలను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఐజీ తెలిపారు. "భయపడకుండా చట్టాన్ని అమలు చేస్తాం బాధితులను ఆదుకుంటాం" అనే నినాదంతో మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలి

### ఎమ్మెల్సీ డా. కుంభా రవిబాబు




**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ : 17**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అమలు చేస్తున్న ఫేషియల్ అటెండెన్స్ విధానం గిరిజన ప్రాంతాల కూలీలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డా. కుంభా రవిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మారుమూల గిరిజన గ్రామాల్లో సరైన ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో కూలీలు హాజరు నమోదు చేయడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోజుకు రెండు సార్లు ఫోటోలు తీసి అప్లోడ్ చేయాల్సిన నిబంధన కూలీలకు భారంగా మారిందని, నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఫోటోలు అప్లోడ్ కాకపోవడంతో పనికి హాజరైనా నమోదు కాకపోతున్న పరిస్థితులు ఉన్నాయని వివరించారు. దీంతో కూలీలు తమ వేతనాలు కోల్పోతామేమోనన్న ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎండ తీవ్రత మధ్య ఈ విధానం మరింత కష్టతరంగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత హాజరు విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక సమస్యలను పరిగణనలోకి తీసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అదనంగా, ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు, పని ప్రదేశాల్లో అవసరమైన పనిముట్లు, తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీల దినసరి వేతనాన్ని రూ.600కు పెంచాలని, మేట్లకు కూడా జీతాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ డా. కుంభా రవిబాబు విజ్ఞప్తి చేశారు.

# ప్రతి శుక్రవారం పోలీసు గ్రీవెన్స్ కార్యక్రమం

## ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి




**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :17**

జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా "డయల్ యువర్ ఎస్పీ" (పోలీసు గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 4.00 గంటల వరకు నిర్వహించబడుతుంది. జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది తమ వ్యక్తిగత, ఉద్యోగ సంబంధిత సమస్యలను నేరుగా ఫోన్ ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కల్పించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సిబ్బంది తమ సమస్యలను తెలియజేయగా, ఎస్పీ వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, త్వరిత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సిబ్బంది సీనియారిటీ, ప్రమోషన్లు, సెలవుల మంజూరు, వేతన బకాయిలు, ఇంక్రిమెంట్లు, ఇన్‌కమ్ ట్యాక్స్ సమస్యలు, ఆరోగ్య సమస్యలు, స్పౌజ్ కేటగిరీ పోస్టింగ్స్, వసతి సదుపాయాలు, పెన్షన్, రిటైర్మెంట్ ప్రయోజనాలు, డ్యూటీ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తదితర అంశాలపై తమ సమస్యలను తెలియజేయవచ్చు. పోలీసు సిబ్బంది ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.00 నుంచి 4.00 గంటల మధ్య 6309990800 మొబైల్ నంబర్ లేదా 08942–222508 కార్యాలయ నంబర్ ద్వారా ఎస్పీని సంప్రదించవచ్చు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని, ఈ కార్యక్రమాన్ని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి తెలిపారు.

# గంగలకుర్రు లో టిడిపి శ్రేణుల సమావేశం

**అంబాజీపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గ అంబాజీపేట మండలంలో గంగలకుర్రు గ్రామం లో 135 బూత్ వీకుగా ఉన్న కారణంగా పార్టీ ఆదేశానుసారం అబ్జర్వర్ అధికారపు జయలక్ష్మి వచ్చి మీటింగ్ ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ మండల పార్టీ అధ్యక్షులు గూడాల ఫణి, మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము ,గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు గంగుమళ్ల వీరభద్రం, కమిడి వీర వెంకట సత్యనారాయణ, దూనబోయిన బాబులు, కాగితాపల్లి సాయిరాం, బూత్ కన్వీనర్ అరిగెల త్రిమూర్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సఖినేటిపల్లిలో జనగణన శిక్షణ శిబిరం విజయవంతం- ఎమ్మార్వో





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 17**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన గణనను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం వెంకటేశ్వరరావు తెలియజేశారు. కుటుంబ సమగ్ర సమాచారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. జనగణన నిబంధనల మేరకు రూపొందించిన 34 ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలను సేకరించాలన్నారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే జనగణనను పూర్తిగా మొబైల్ యాప్ లో నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయం లో జనాభా గణన పరిచయంను 2027 లో భాగంగా ది ఏప్రియల్ 15 నుండి 17 వరకు 3 రోజుల పాటు సెన్సస్ ఫీల్డ్ ట్రైనర్స్ ఎల్ సోమేశ్వరరావు, గుబ్బల శ్రీనివాసు యాన్యుమరేటర్లు, సూపర్వైజర్ల కు రెండవ విడతలో 50 మందికి మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి చేయడమైనది. 3వ రోజు ఒక హౌస్ లిస్టింగ్ బ్లాక్ ను ఫీల్డ్ లో ఎలా గుర్తించాలో యాన్యూమోటర్స్, సూపర్వైజర్స్ కు ప్రాక్టికల్ గా చూపించడం జరిగింది. యాన్యూమోటర్స్ ఎటువంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవాలన్నారు. సమాచారం సేకరణకు ఇంటింటికి వెళ్లేటప్పుడు ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించి ముందుగానే సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పి ఆర్ సి రాజ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సి ఎస్ రాజు, మండల సెన్సస్ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఆర్ ఐ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అండ

### సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కార్మికులందరూ తప్పని సరిగా తమ పేర్లను నమోదు చేసుకుని, ఈ ఆర్థిక ప్రయోజనాలను పొందాలని ఆయన కోరారు. పథకాలు మరియు అందుబాటులో ఉన్న ఆర్థిక సాయం గురించి తెలుపు తూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో నమోదైన కార్మికులకు వివాహ కానుక కింద 20 వేల రూపాయలు, ప్రసూతి ప్రయోజనం కింద 20 వేల రూపాయలు, సహజ మరణానికి గాను 60 వేల రూపాయలు,అంత్యక్రియ లకు గాను 20 వేల రూపా యలు ఆర్థిక ప్రయోజనా లు అందించ బడతాయ న్నారు. వయో పరిమితి 18 ఏళ్ల నుండి 60 ఏళ్ల లోపు వయస్సు ఉన్న భవన నిర్మాణ కార్మికులందరూ ఈ పథకానికి అర్హులన్నారు .నమోదు రుసుము క్రింద రిజిస్ట్రేషన్ సమయం లో ఒకేసారి రూ 50 లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.?వార్షిక ప్రీమియం పథకం క్రింద కొనసాగడానికి గాను సంవ త్స రానికి కేవలం రూ.12 లు మాత్రమే ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందన్నారు. అర్హులైన కార్మికులు తమ సమీపంలోని సహాయ కార్మిక శాఖాధికారి కార్యా లయాన్ని సందర్శించి వెంటనే నమోదు చేసుకో వాలని ఆయన ప్రకటనలో కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి హామీ కార్మికుల యోగ క్షేమాలు తెలుసుకున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

మండలంలోని సి.హెచ్. గున్నేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపడుతున్న శ్రామికులతో ప్రభుత్వ విప్ ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మాట్లాడారు. చెయ్యేరు లో ఒక కార్యక్రమం ముగించుకొని తిరిగి వస్తుండగా అక్కడ జరుగుతున్న ఉపాధి హామీ పనులను గమనించిన ఆయన, కార్మికుల వద్ద ఆగి పలు సూచనలు చేశారు. ఎండ వేడి అధికంగా ఉన్న కారణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైనంతవరకు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తపడాలని కార్మికులకు తెలియజేశారు. ఎమ్మెల్యే తమను చూసి ఆగి తమ యోగక్షేమాలను తెలుసుకోవడం, ఆరోగ్యం పట్ల చూపిన శ్రద్ధకు ఉపాధి హామీ కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

## పవర్ లిఫ్టర్ ఇందిరను సత్కరించిన వైసిపి నేత రమణారావు



**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

ఉప్పలగుప్తంకు చెందిన వైసిపి బిసి విభాగం మండల అధ్యక్షుడు యనమదల పల్లంరాజు కుమార్తె ఇందిర పవర్ లిఫ్టింగ్ లో తన ప్రతిభను చూపుతుంది.ఇందిరను శుక్రవారం ఆమె ఇంటి వద్ద అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఇందిరకు దుశ్శాలువాకప్పి సత్కరించి అభినందించారు.ఇందిర ఎనిమిదో తరగతి చదువుతూ అనతికాలంలోనే జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయింది.ఇప్పటికే జిల్లా,రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్స్ సాధించింది. ఇందిర జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కూడా పతకాలు సాధించాలని ఈ సందర్భంగా రమణారావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చిక్కం మైనర్ బాబు,మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్,వైసిపి నాయకులు నేలపూడి సుగంధ కుమార్, నేరేడుమిల్లి శ్రీను,పందిరి సుబ్బరాజు,జొన్నాడ చిన్ని, బొర్రాపాలెపు సూర్యనారాయణ,,పరమట రాజేష్,పరమట మురళి,దోనిపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వెలగపూడి పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న పి గన్నవరం ఎమ్మెల్యే



**పి గన్నవరం/వెలగపూడి, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ భవనంలోని మొదటి అంతస్తు, రూమ్ నెం. 201లో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో భాగంగా, ఏప్రిల్ 17 (రెండవ రోజు)న పలు ప్రభుత్వ రంగ సంస్థల గత ఐదు సంవత్సరాల వార్షిక నివేదికలు, సాధారణ కార్యకలాపాలపై సమీక్ష చేపట్టారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు మరియు ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి సంస్థలపై విస్తృతంగా చర్చ జరిగింది. కమిటీ సభ్యులు ఆయా సంస్థల పనితీరు, ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుత ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్ ప్రణాళికలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. సంస్థల పనితీరును మరింత మెరుగుపర్చడానికి అవసరమైన సూచనలు మరియు మార్గదర్శకాలను ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడం,పారదర్శకత పెంపొందించడం,వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

# పిల్లల తండ్రులు కోసం పదార్థాల బొమ్మల పోటీలు...





సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 17: డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలంలో 8 వ పోషణ పక్వాడ 2026 ఏప్రియల్ 9 నుండి 23 వరకు ప్రతి గ్రామంలో బొమ్మల తయారు చేయటం, స్థానిక పదార్థాలతో బొమ్మలు చేయటం, పిల్లలతండ్రుల కోసం పోటీలు నిర్వహించారు. ఐ సి డి ఎస్ సి ఓ పి ఓ ఇందిర ఆధ్వర్యంలో మోరీ పోడు గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో స్థానిక పిల్లల తండ్రులకు బొమ్మల తయారీ పోటీలు జరిగినవని, మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రకళ, కిరణ్ జ్యోతి, విజయ, నాగ దుర్గా, సాయి కుమారి, బిందు, ఆశ, మాధవి, అంగన్వాడి కార్యకర్తలు, పిల్లల తండ్రులు, స్థానికులు, తదితరులు పాల్గొనారు.

# విద్యుత్ షాక్‌తో పంచాయతీ కార్మికుడి మృతి

### అధికారుల నిర్లక్ష్యమే కారణం - సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్ ధ్వజం

**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం, వేరవల్లిపాలెం గ్రామ పంచాయతీలో విధి నిర్వహణలో ఉండగా విద్యుత్ షాక్‌కు గురై కాంట్రాక్ట్ కార్మికుడు ఉద్రాజావరపు శ్రీనివాస్ (54) మృతి చెందడంపై సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన మండిపడ్డారు. శుక్రవారం వీరవల్లిపాలెం గ్రామంలో వీధి దీపాలు మారుస్తుండగా శ్రీనివాస్ కి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించారు.ఈ సంఘటనపై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా పంచాయతీ కార్మికుడిగా సేవలందిస్తున్న శ్రీనివాస్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. లైన్ క్లియరెన్స్ లేకుండా బల్బులు మార్పించడం విద్యుత్ లైన్ మెన్, పంచాయతీ కార్యదర్శి వైఫల్యమేనని, ఈ ప్రమాదానికి సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

**సిఐటియు తరపున ప్రధాన డిమాండ్లు:**


మృతుని కుటుంబానికి తక్షణమే 20 లక్షల ఎక్స్‌గ్రేషియా



(నష్టపరిహారం)లి చెల్లించాలి. మృతుని భార్యకు గ్రామ పంచాయతీలో అవుట్‌సోర్సింగ్/కాంట్రాక్ట్ ఉద్యోగం కల్పించాలి. నిలువ నీడ లేని ఆ కుటుంబానికి ఇళ్ల స్థలం కేటాయించి, ప్రభుత్వమే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్మికుల రక్షణ పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా కన్వీనర్ జార్జి , పత్రిక ప్రకటన విడుదల చేశారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యత

### జిల్లా ఎస్పీ రాహుల్ మీనా





**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా ఎస్పీ సంపర్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వ్యక్తిగత మరియు వృత్తిపరమైన సమస్యలను మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ ద్వారా ఎస్పి కి విన్నవించుకున్నారు. సెలవులు,ఆరోగ్య సమస్యలు ఇతర సర్వీసు పరమైన ఇబ్బందులను ఫోన్ ద్వారా ఎస్పీ కి విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను సావధానంగా విన్న ఎస్పీ, వాటిని పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించేలా, సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఈ సందర్భంగా ఎస్పీ భరోసా ఇచ్చారు. పోలీస్ సిబ్బంది యొక్క సంక్షేమం,భద్రత మొదటి ప్రాధాన్యత. సిబ్బంది మానసిక ప్రశాంతతతో ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరు. అందుకే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు సీఐ పై సస్పెన్షన్ వేటు

## -క్రికెట్ బెట్టింగ్ ముఠాతో కుమ్మక్కు

**చిత్తూరు జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 17**

చిత్తూరు జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న పోలీసు అధికారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్ ముఠాతో చేతులు కలిపి అక్రమ వసూళ్లకు పాల్పడిన చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర మోపూరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న రాయుళ్లు పట్టుబడిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తుల నుంచి కేసులను సడలించేందుకు, చర్యలు తీసుకోకుండా ఉండేందుకు సీఐ మహేశ్వర లక్షలాది రూపాయలు



వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అంశంపై వచ్చిన ఫిర్యాదులను గంభీరంగా తీసుకున్న ఉన్నతాధికారులు వెంటనే విచారణకు ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు చేపట్టి, బెట్టింగ్ ముఠాతో సీఐకి ఉన్న సంబంధాలపై కీలక సమాచారం సేకరించారు. ఫోన్ కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలు, మధ్యవర్తుల ద్వారా జరిగిన డీలింగ్స్ వంటి అంశాలపై పరిశీలన జరిపినట్లు తెలుస్తోంది. ఈ విచారణలో సీఐ అక్రమ వసూళ్లలో పాల్పడ్డాడని సూచించే ప్రాథమిక ఆధారాలు లభించడంతో, వాటితో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను సైతం పట్టించుకోకుండా సీఐ తన అక్రమ కార్యకలాపాలను కొనసాగించినట్లు తేలింది. అధికార దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా, శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించినట్లు కూడా విచారణలో వెల్లడైంది. ఈ నివేదిక ఆధారంగా ఎస్పీ సిఫార్సు మేరకు అనంతపురం రేంజ్ ఐజీ షిమోసి సీఐ మహేశ్వరపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. ఈ ఘటన జిల్లా పోలీసు శాఖలో కలకలం రేపింది. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారి నేరస్థులతో కుమ్మక్కు కావడం తీవ్రంగా విమర్శలకు గురవుతోంది. ఈ ఘటన ద్వారా పోలీసు శాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిపై ఎలాంటి రాజీ ఉండదని ఉన్నతాధికారులు గట్టి సంకేతాలు పంపారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే ఎంతటి అధికారినైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అలాగే, ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతుండగా, అవసరమైతే ఇతరుల ప్రమేయంపైనా విచారణ జరిపే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# అగ్నిమాపక వారోత్సవాలు భాగంగా ఆర్కిడ్స్ గ్లోబల్ స్కూల్ నందు విద్యార్థులకు అవగాహన సదస్సు సేఫ్టీ ప్రికాషన్స్




**కాకినాడ జిల్లా పిఠాపురం ఏప్రిల్ 17 సిటిజన్ టైమ్స్:-**
పిఠాపురం నియోజవర్గంలో అగ్నిమాపక నియంత్రణ వారోత్సవాలు భాగంగా ఆర్కిడ్స్ గ్లోబల్ స్కూల్ నందు మాక్ డ్రిల్ నిర్వహించారుఅగ్నిమాపక నియంత్రణ దినోత్సవం పురస్కరించుకొని పిఠాపురం పట్టణంలో రామ అగ్నిమాపక అధికారి సీఐ రామకృష్ణరాజు ఆధ్వర్యంలో ప్రతి స్కూల్లో పిల్లల పాటించవలసిన సేఫ్టీ పద్ధతులు తోటి వారికి ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వారిని ఎలా రక్షించాలి ఎటువంటి భద్రత నియమాలు పాటిస్తూ తనని తాను కాపాడుకుంటూ మిగతా వారిని ఎలా కాపాడాలని తెలియజేశారు.అంతేకాకుండా అగ్ని ప్రమాదం సంభవించి నప్పుడు ఏ మార్గం ద్వారా వెళ్ళాలి ఎవరికీ సమాచారం అందించాలి వీటన్నిటి ద్వారా పిల్లలు ఏమి నేర్చుకున్నారో వాటిని సూచనలు చేస్తూ వారిచేతే చేయిస్తూ ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సీఐ రామకృష్ణ రాజు మాట్లాడుతూ అగ్నిమాపక దినోత్సవం అగ్నిమాప సిబ్బంది చేసిన ప్రాణ త్యాగాలను గుర్తుతెచ్చుకుంటూ అగ్నిమాపక దినోత్సవం జరుపుకుంటున్నామని దీని ద్వారా హాస్పటల్ నందు కళాశాల నందు పాఠశాల నందు జన సమూహం ఎక్కువగా ఉన్న షాపింగ్ మాల్, అపార్ట్మెంట్స్ లో ఇతరత్రా ప్రాంతాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు గృహపకరణాలలో వాడే గ్యాస్ మరియు విద్యుత్తు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా బయటపడాలి ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి అగ్ని ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం వివరించడం జరిగింది.అనంతరం ఆర్కిడ్స్ గ్లోబల్ స్కూల్ మేనేజ్మెంట్ డైరెక్టర్ రఘు కిషోర్ రెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక సంబంధించిన అధికారులు మా స్కూల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలా బయటపడాలి అన్న దానిపై చాలా విశ్లేషంగా వివరించడం జరిగిందని ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని తమ స్కూల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ అగ్నిమాపక వారోత్సవ అవగాహన కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్.ఎఫ్.హరి ప్రసాద్, ఫైర్ మాన్ సురేష్, డ్రైవర్ శ్రీను బాబు, శ్రీనుబాబు,ఆర్కిడ్స్ గ్లోబల్ స్కూల్ మేనేజ్మెంట్ డైరెక్టర్ రఘు కిషోర్ రెడ్డి,అనూష, స్కూల్ సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పి రాహుల్ మీనా కి జన్మదిన శుభాకాంక్షలు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**
అంబేద్కర్ కోనసీమ జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శ్రీ వెంకటేశ్వర వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ బోనం సత్తిబాబు జనసేన నాయకులు తిక్క మురళి తదితరులు పాల్గొన్నారు.


## స్వీయ గణన నమోదు చేసిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్..

### స్వీయ గణన నమోదుపై అవగాహన కలిగించాలి..

### -జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**
జనగణన-2027లో భాగంగా 'స్వీయ గణన' నమోదు కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందు మాధవ్ శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ లో స్వీయ గణన నమోదు ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వీయ గణనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16 నుంచి 30వ వరకు సెన్సెస్ పోర్టల్ నందు కుటుంబ యజమానులు వారి స్వీయ వివరాలు భారత ప్రభుత్వ వెబ్సైట్ లో స్వయంగా నమోదు చేసుకొన ప్రజలందరికీ అవకాశం కల్పించిందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు పోర్టల్ ద్వారా స్వీయ గణన చేసుకోవాలని సూచించారు. స్వీయ గణన' నమోదు పూర్తిగా స్వచ్ఛందమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## భవన నిర్మాణ కార్మికులకు మరింత భరోసా..

### సామాజిక భద్రత పథకాల పునరుద్ధరణ..

### -జిల్లాలోని భవన ఇతర నిర్మాణ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

### - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కార్మికశాఖ వారు భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో కొన్ని సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సంక్షేమ బోర్డు (ఆంధ్రప్రదేశ్ భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు) లో నమోదైన కార్మికుడు, కార్మికురాలికి అండగా నిలిచేందుకు సెప్టెంబర్, 2020 సంవత్సరంలో నిలిపివేసిన సంక్షేమ పథకాలను మార్చి 1వ తేది, 2026 నుంచి తిరిగి పునరుద్ధరించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం తిసుకున్న ఈ నిర్ణయంతో కార్మికుల సంక్షేమ బోర్డు కింద నమోదైన కార్మికులకు ఈ క్రింది ప్రధాన సంక్షేమ పథకాలు వర్తించనున్నాయన్నారు.

**-వివాహ కానుక:** రూ .20,000/- కార్మికుని కుమార్తె లేదా మహిళా కార్మికురాలి వివాహానికి ఆర్థిక సహాయం (గరిష్ఠంగా ఇద్దరు కుమార్తెలకు).

**-ప్రసూతి సహాయం:** రూ .20,000/- మహిళా కార్మికురాలికి లేదా కార్మికుని భార్య/కుమార్తెకు మొదటి రెండు కాన్పుల వరకు వైద్య సహాయం.


**-సహజమరణం:** రూ .60,000/- కార్మికుడు సహజంగా మరణించిన పక్షంలో వారి నామినీకి ఆర్థిక సహాయం.

**-దహన సంస్కారాల నిమిత్తం:** రూ .20,000/- కార్మికుడు సహజంగా మరణించిన పక్షంలో వారి నామినీకి ఆర్థిక సహాయం.

భవన ఇతర నిర్మాణ రంగ కార్మికులుగా నమోదు చేసుకొనేందుకు వయస్సు18 నుండి 60 సం.ల లోపు వారు మాత్రమే అర్హులని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందుకు ఆధార్, రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలు ఉండాలన్నారు. పైన పేర్కొన్న సంక్షేమ పథకాలకు అర్హత పొందిన కార్మికులు తమ సమీపంలో గల కార్మిక శాఖ అధికారి కార్యాలయములో భవన నిర్మాణ కార్మికులుగా తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే కార్మికులు నమోదైతే తప్పనిసరిగా రెవిన్యువల్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని భవన ఇతర నిర్మాణ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇందుకు తమ సమీపంలో గల కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఫోన్ నెం: 9492555112.కు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు.

## ఈనెల 18న స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర పై దిశ నిర్దేశం

### జిల్లా కలెక్టర్ మహేష్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించి పరిశుభ్రతకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు . శు క్రవారం రాష్ట్ర పురపా లక పరిపాలన పట్టణా భివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ అమరావతి నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరె న్స్ నిర్వహించి ఈ నెల 18వ తేదీ నిర్వహించ నున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలపై దిశ నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాస్థాయి అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కోనసీమ జిల్లాను పరిశుభ్రమైన పర్యాటక ప్రాంతాలు మరియు వారసత్వ సంపద అనే ఇతివృత్తంతో స్వచ్ఛత, పరిశు భ్రత కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలన్నారు. పరిశుభ్రంగా ఉండటమే కాకుండా, పర్యాటక రంగం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రం పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో ప్రతి మూడో శనివారం నిర్వ హిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు.ప్రజలు పరిశుభ్రతను తమ జీవన శైలిలో ఒక భాగంగా అలవర్చుకోవాలన్నారు, ప్రజలు,ప్రభుత్వ అధి కారులు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యంగా పాల్గొని పరిశుభ్రతపై కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా అవగాహన పెంపొందించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు గ్రామాలు మరియు పట్టణాలలో పారిశుధ్య పరిస్థితుల మెరుగుదల.ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ మరియు పర్యావరణ పరిరక్షణ చర్యలు చెత్తను వర్గీకరించి సక్రమంగా నిర్వహించే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు.పాఠశాలలు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాలలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించా లన్నారు.డ్రైనేజీ వ్యవస్థల పరిశుభ్రత మరియు దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు ప్రతి కుటుంబం, ప్రతి సంస్థ పరిశుభ్రత బాధ్యతగా తీసుకోవాలని, ప్రోత్సహిస్తూ ప్రజలలో ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించాలన్నారు. ప్రతి పౌరుడు తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకరించా లని, ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో భాగస్వా ములు కావాలని విజ్ఞప్తి చేశారు ?ఏప్రిల్ 18వ తేదీన ప్రపంచ వారసత్వ దినోత్స వాన్ని పురస్కరించుకుని ఈ నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛతా కార్య క్రమాన్ని మన చారిత్రక కట్టడాలు,పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతకు అంకితం చేయాలన్నారు.?వారసత్వ కట్టడాల పరిరక్షణ: మన రాష్ట్రంలోని చారిత్రక కోటలు, ప్రాచీన దేవాల యాలు, శిథి లావస్థలో ఉన్న కట్టడాల ప్రాంగణాలను శుభ్రం చేయాలన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా పర్యాటకుల రాక పెరుగుతున్న నేపథ్యంలో పర్యా టక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం మరియు చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.స్థానిక ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాము లను చేస్తూ మన సంస్కృ తి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంచాలన్నారు. ?పర్యాటక మరియు వారసత్వ కట్టడాల సమీపంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్"వినియోగాన్ని అరికడుతూ ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు.

## ఈనెల 21 వ తేదీన అమలాపురంలో జాబ్ మేళా

**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**
ఈనెల 21 వ తేదీన ఉదయం 10:30 కి అమలాపురంలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉపాధి కార్యాలయం వద్ద జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి జి. శ్రీనివాసరావు తెలిపారు. ప్రముఖ సంస్థల్లో వివిధ ఉద్యోగాలకు ఎస్ఎస్సి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటిఐ, డిప్లమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. దీనిపై మరిన్ని వివరాలకు 8978905032 ను సంప్రదించాలన్నారు.

## జనాభా స్వీయ గణన ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**
జనాభా సర్వే-2027 లో భాగంగా ప్రజలు స్వీయ గణన విధానాన్ని వినియోగించుకోవాలని గౌరవ ప్రభుత్వ విప్పు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు సూచించారు.ఈ సందర్భంగా ఆయన స్వయంగా ఆన్‌లైన్‌లో గణన పూర్తి చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. వివరాలు, పద్ధతులు తెలుసుకోవడానికి అధికారులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో సిబ్బంది సహకారంతో ప్రతి కుటుంబం ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. గణన ప్రక్రియ సులభంగా, పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు అందుబాటులో ఉండే వెబ్ పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని అన్నారు. అవసరమైతే గ్రామ/వార్డు సచివాలయాల్లో సహాయం అందిస్తారని తెలిపారు. ఈ డిజిటల్ విధానం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు ఖచ్చితమైన డేటా సేకరణకు దోహదపడుతుందని శ్రీ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని జనాభా గణనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రమణ్యం ను సత్కరించిన బిజెపి శ్రేణులు



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**
కొత్తపేటలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం నూతనంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా వారిని మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజీ వేమ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ , బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ తదితరులు రెడ్డి సుబ్రహ్మణ్యం స్వగృహం వద్ద ఆయనకి శుభాకాంక్షలు తెలియజేసి సాలువాతో ఘనంగా సత్కరించి ఆయనకి అభినందనలు తెలియజేశారు.

## చెయ్యేరు హై స్కూల్ ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**కాట్రేనికోన సిటిజన్ టైం ఏప్రిల్ 17**
శుక్రవారం ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో గల హైస్కూల్ నందు ఆర్ఓ ప్లాంట్ ఓపెనింగ్ ఎమ్మెల్యే ముమ్మిడివరం దాట్ల బుచ్చిరాజు పాల్గొన్న కార్యక్రమంలో చెయ్యేరు తాజా మాజీ సర్పంచ్ చెల్లి సురేష్ ,గ్రామస్తులు ,రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం పాల్గొన్నారు.

## ప్రాణభద్రతకై హెల్మెట్ తప్పనిసరి



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**
ద్విచక్ర వాహన దారుల ప్రాణ భద్రత కొరకు హెల్మెట్ ధారణ ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులనూ ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన రోడ్ సేఫ్టీ సమావేశం జరిగింది. జిల్లాలో రహదారి భద్రత జిల్లాలో అమలౌతున్న కార్యక్రమాలను ఆయన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి. బిందుమాధవ్ తో కలిసి అధికారూలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని జాతీయ రహదారులపై తరచు ప్రమాదాలు జరుగతున్నట్లుగా గుర్తించిన 40 బ్లాక్ స్పాట్ లను సురక్షితంగా మలచేందుకు చేపట్టవలసిన చర్యలను కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. బ్లక్ స్పాట్ లలో విద్యుత్ దీపాలు, హెచ్చరిక బోర్డు లు, అప్రోచ్ రోడ్లలో వేగనిరోదకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో హెల్మెంట్ సీటు బెల్ట్. పెట్టుకోక పోవడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని, ధారణ వాహనదారులు ఖచ్చితంగా పాటించేలా నిబంధనలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పోలీస్, రవాణా శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే ద్విచక్ర వాహనాలపై ట్రిపిల్ రైడింగ్, ఆటోలలో ఓవర్ లోడింగ్ నిరోధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రవాణా, ఆర్అండ్ బి, నేషనల్ హైవేస్, పోలీస్, ఆర్టీసి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గవర్నమెంట్ హాస్పిటల్‌కు కూలింగ్ వాటర్ ఫ్రిజ్ బహుకరించిన బీజేపీ నాయకులు



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

గిద్దలూరు పట్టణ లో గవర్నమెంట్ హాస్పిటల్ కు యువ బీజేపీ నాయకులు దప్పిలి వినోద్ కుమార్ రెడ్డి తండ్రి దప్పిలి ప్రసాద రెడ్డి జ్ఞాపకార్థం హాస్పిటల్ కు వచ్చే పేషెంట్ ల కు వేసవి తాపానికి చల్లని నీటిని అందించే ఉద్దేశ్యం తో కూలింగ్ వాటర్ ఫ్రిజ్ ను బహుకరించార. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథిగా ఏం ఎల్ ఎ అశోక్ రెడ్డి సోదరులు టిడిప నాయకులు ముత్తు ముళ్ళ కృష్ణ కిషోర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపచేశారు. ఈ కార్యక్రమం పట్టణ బీజేపీ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ,బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాషి వెంకట రామాంజనేయులు, ఓ బి సి మోర్చా జిల్లా కార్య వర్గ సభ్యులు వీర చక్రము, గిద్దలూరు మార్కెట్ యార్డ్ బోర్డు మెంబర్ బాదుల్లా, సంతోష్ కుమార్, మునగ నూరి రామక్రిష్ణ, రాచర్ల మండల బీజేపీ జనరల్ సెక్రటరీ ధనలక్ష్మి,హాస్పిటల్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొనడం జరిగింది.

# పొదిలిలో ఓబుల్ రెడ్డిని కలసిన దేశం నాయకులు

**పొదిలి, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

పొదిలిలో తెలుగుదేశం నాయకులు మీగడ ఓబుల్ రెడ్డి ని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కలుసుకున్నారు. ఓబుల్ రెడ్డిని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని శుక్రవారం నాడు పట్టణంలోని ఓబుల్ రెడ్డి నివాసానికి తెలుగుదేశం నాయకులు వెళ్లి, ఆయనను శాలువా, పూలదండలతో సత్కరించి, తమ అభినందనలు తెలియజేశారు. ఓబుల్ రెడ్డి ని కలసిన వారిలో మర్రిపూడి ఎం పి పి వాకా వెంకటరెడ్డి, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, నాయకులు వేంపాటి పోలిరెడ్డి, షేక్ అల్లా బకాష్, వీరిశెట్టి సురేష్, షేక్ రసూల్, ఎస్ షబ్బీర్, ముల్లా గౌస్, షేక్ మౌలాలి, ఆర్ శ్రీను తదితరులు ఉన్నారు.

# అనాధవరంలో 20 ఏళ్ల నాటి విద్యుత్తు సమస్య పరిష్కారం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్





**ముమ్మిడివరం,సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

మండల పరిధిలోని అన తవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గత 20 ఏళ్లుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్,విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇటీవల కాలంలో గన్నవరం పాఠ శాలలో బొమ్మ పడి విద్యార్థిని మరణించడం వంటి పలు సంఘటనలు ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తం గా పాఠశాలల స్థితిగతులు వసతులు పట్ల ఆడిట్ నిర్వహించడం జరిగిందని, ఈ ఆడిట్లో పలు ప్రమాదక ర అంశాలు తమ దృష్టికి వచ్చాయని వీటిలో అనా తవరం పాఠశాల ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ పాఠశాల ప్రాంగణంలో ప్రమా దకరంగా గత 20 ఏళ్లుగా ట్రాన్స్ఫార్మర్ మరియు విద్యుత్ వైర్లు అడ్డంకిగా ఉండడం గమనించి తొల గింపు ప్రక్రియను ఏపీ ఈపీడీ సీఎల్ పర్యవేక్షణ ఇంజనీర్ బి.రాజేశ్వరి సారథ్యంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు పాఠశాలలో 300 మంది విద్యార్థినీ విద్యార్థుల శ్రేయస్సును కోరుతూ ప్రధానోపాధ్యాయురాలు కె రాధ, తల్లి దండ్రుల కమిటీ ఈ అంశాన్ని తమ దృష్టికి తీసుకొచ్చిన నేపద్యం మరియు ట్రా న్స్ఫార్మర్ ఉన్న ప్రాంతంలో వికలాంగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించిన మీదట యుద్ధ ప్రాతిపదికన తొలగింపు చర్యలు చేపట్టి ట్రాన్స్ఫార్మర్ పాఠశాల బయటి ప్రాంతానికి మార్పు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అన్నారు.ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను పాఠశాల ప్రాంగణశీ నుండి తొలగించి వేరే ప్రాంతానికి మార్పు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా తక్షణమే స్పందించి తొలగింపు చర్యలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ కి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే. రాధ, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# 179 మంది వివోఏలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ

## -కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు -టెక్నాలజీని నిత్యం ఫాలో అవ్వండి

## -పొదుపు గ్రూపులను మరింత బలోపేతం చేయాలని సూచన

**కందుకూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల వివోఏ లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరగగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.179 మందికి ఫోన్లు అందజేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పొదుపు గ్రూపులకు చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని, అప్పటినుంచి మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడేలా రుణాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఒక్కొక్క గ్రూపుకు గరిష్టంగా 20 లక్షలు వరకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయన్నారు. గతంలో రుణాలు తీసుకున్న మహిళలు పాడిపరిశ్రమ కోసం వాటిని ఉపయోగించుకునే వారని, ప్రస్తుతం వ్యాపారాల మీద దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు సంపాదించుకుంటున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. వివోఏలు ప్రతి మహిళను పొదుపు గ్రూపుల్లో చేర్చే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వారిలో చైతన్యాన్ని కలిగించాలన్నారు. గతంలో స్వర్గీయ ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కులు వాటాలు కల్పించారని ఎమ్మెల్యే గుర్తుచేస్తూ... చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక డ్వాక్రా గ్రూపుల ఏర్పాటుతో మహిళలకు అండగా నిలిచారని



అన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించారని చెప్పారు. ప్రస్తుతం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఆమోదం పొందబోతోందని, ఇది మహిళామూర్తులు సాధించిన విజయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రోజురోజుకు మారుతున్న టెక్నాలజీ పై వివోఏలు అవగాహన పెంచుకొని విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.



గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, తద్వారా నియోజకవర్గ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఇంచార్జ్ ఎంపీడీవో ఓబులేసు, కందుకూరు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మేడికొండ కెజియా, ఉలవపాడు అధ్యక్షురాలు సుగుణమ్మ, ఏపిఎంలు సింహాద్రిరావు, సురేష్, కృష్ణయ్య, చినబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు విద్యపై ఆసక్తి పెంచాలి...

## సూపర్వైజర్ కె.వి. సుబ్బమ్మ



**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

పుల్లల చెరువు మండలం యండ్రపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ మెయిన్ సెంటర్‌లో 8వ పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సమగ్ర విద్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో విద్యాపట్ల అవగాహన పెంపొందించడంలో కీలకంగా నిలిచింది.3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్నారులు విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్వైజర్ కె.వి. సుబ్బమ్మ మాట్లాడుతూ చిన్నారులకు చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంచడం అత్యంత అవసరమని అన్నారు.మానసిక, శారీరక అభివృద్ధికి ప్రాథమిక విద్య పునాది వంటిదని, బాల్యంలోనే మంచి అలవాట్లు అలవరచి, విద్యపై దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించడం సులభమవుతుందని అన్నారు.గ్రామస్థుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు పాటలు, ఆటలు, నృత్యాలు, వినోదాత్మక ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. వారి ప్రతిభను చూసి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలు పూర్తయిన చిన్నారులను పాఠశాలలో చేర్పించే నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి, తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణ, విద్యాపట్ల బాధ్యతలపై అవగాహన కల్పించారు. చిన్నారుల భవిష్యత్తు బలంగా ఉండాలంటే ప్రారంభ దశ నుంచే సరైన దిశలో విద్య అందించాల్సిన అవసరం ఉందని వివరించారు.గ్రామంలోని తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని తమ పిల్లల విద్యపై ఆసక్తి కనబరిచారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని గ్రామ పెద్దలు సూచించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఎం.ఎల్.హెచ్.పీ రాజు, సర్వేయర్ రమేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మీరావలి, విఆర్ఓ ఘని, హోమియో డాక్టర్ యాకోబు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.కె. షాహీదా, డి. రాజేశ్వరి, డి. శంకరి బాయ్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం పట్టణంలో వాహన తనిఖీలు





**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

మార్కాపురం పట్టణం జిల్లా అయిన నేపథ్యంలో ప్రతిరోజు పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని మార్కాపురం టౌన్ ఎస్ఐ సిహెచ్ అహరోను సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను మరియు త్రిబుల్ రైడింగ్, ఆటోలని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడుపుతున్నట్టు తెలిస్తే కఠినంగా చర్యలు ఉంటాయన్నారు. ఈ తనిఖీలలో కానిస్టేబుళ్లు మరియు ట్రాఫిక్ హోంగార్డులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన

**ముమ్మిడివరం ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఏప్రిల్ 17 తారీకున ఫైర్ వారోత్సవాలలో భాగంగా యాపిల్ స్కూల్ ,తారా డిగ్రీ కాలేజీలో, సంసిద్ స్కూల్ లో ఎల్పిజి గ్యాస్ ఆర్పడం డెమో చేసి చూపించడం అయినది, ఎల్పిజి గ్యాస్ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించుట జరిగింది ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ గురించి, ఏసి వాడకం,సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు సలహాలలను గృహనీలకు వివరించడం జరిగిందని అగ్నిమాపక అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.



# త్రిసభ్య కమిటీలో సభ్యునిగా కోనంగి వెంకటకొండయ్య నియామకం

## పశుపోషకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా -వెంకట కొండయ్య

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

ఉమ్మడి ప్రకాశం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ త్రిసభ్య కమిటీలో సభ్యునిగా మండలంలోని వెంకటాయచెరువు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మండల క్లస్టర్ ఇన్చార్జి కోనంగి వెంకటకొండయ్యను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మండలంలోని టిడిపి నాయకులు, పశుపోషకులు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా కోనంగి వెంకటకొండయ్య మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, అలాగే జిల్లా, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఊపిరి నింపుతున్నాయని, ముఖ్యంగా పశుసంవర్ధక రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వల్ల గొర్రెల పెంపకందారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. రైతులు, పశుపోషకులకు సబ్సిడీలు, వైద్య సేవలు, బీమా వంటి పథకాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామ స్థాయిలో పశు పోషకులతో మమేకమై



గొర్రెల పెంపకం దారుల సమస్యలను గుర్తించి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ కోనంగి వెంకట కొండయ్య మారుమూల ప్రాంతంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి చిన్న వయసులోనే టిడిపి పార్టీ లో చేరి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు వెంకట కొండయ్య నియామకంతో పశు పోషకులకు మరింత మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రీ-సర్వేకు రైతులు సహకరించాలి -మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్

**అర్ధవీడు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 17**

రీ సర్వేకు రైతులు సహకరించాలని మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాపినేనిపల్లె సచివాలయం నందు రీసర్వే పై ఆయన ప్రసంగించారు. భూ రికార్డుల సక్రమీకరణకు చేపట్టిన రీ-సర్వే కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని ఆర్‌డీవో ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సరిహద్దుల స్పష్టత, రైతులకు హక్కుల రక్షణ కోసం రీ-సర్వే కీలకమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో సర్వే నిర్వహిస్తూ, ఎటువంటి లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలని, పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. తహశీల్దార్ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ సర్వే పూర్తయిన తర్వాత భూ రికార్డులు డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. స్థానిక ప్రజలు కూడా సహకరించి, తమ పత్రాలను సమర్పించాలని కోరారు. అధికారులు సమన్వయంతో పని చేస్తే నిర్ణీత గడువులో రీ-సర్వే పూర్తవుతుందని ఆర్‌డీవో ప్రభాకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం రైతులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మదార్ వలి, వీఆర్ఏలు, సర్వేయర్ లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# తారక్ 'డ్రాగన్'.. టోవినో ప్లేస్ లో ఎవరు?



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ ప్రస్తుతం టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఇంటర్నేషనల్ రేంజ్ లో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఆ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.


అయితే ఆ చిత్రానికి సంబంధించిన తాజా అప్డేట్ ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. సినిమాలో పవర్ ఫుల్ విలన్ పాత్ర కోసం మలయాళ నటుడు టోవినో థామస్ పేరు గతంలో వినిపించింది. కానీ తాజాగా ఆయన ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు రీసెంట్ గా స్వయంగా వెల్లడించడం గమనార్హం. ఆ నిర్ణయం తీసుకోవడానికి పర్సనల్ తోపాటు ప్రొఫెషనల్ రీజన్స్ ఉన్నాయని తెలిపారు.టోవినో తప్పుకోవడంతో ఇప్పుడు ఆ కీలక పాత్ర కోసం మరో స్టార్ ను రంగంలోకి దించేందుకు మూవీ టీమ్ ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

ముఖ్యంగా ఒక ప్రముఖ బాలీవుడ్ నటుడితో చర్చలు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఆ నటుడు ఎవరు అన్నదానిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. త్వరలో ప్రకటించనున్నారని సమాచారం.విలన్ రోల్ మార్పుతో డ్రాగన్ సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఇప్పటికే భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఆ చిత్రం, తాజా పరిణామాలతో మరింత హైప్ సొంతం చేసుకుంటోంది. ప్రశాంత్ నీల్ మార్క్ మాస్ ఎలిమెంట్స్, ఎన్టీఆర్ పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలిస్తే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి.అయితే దేవర వంటి భారీ విజయానంతరం ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడం, సలార్ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ప్రాజెక్ట్ కావడం డ్రాగన్ పై ఓ రేంజ్ లో అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ప్రశాంత్ నీల్ తన హీరోలను ఎలివేట్ చేసే స్టైల్ కు అభిమానులు ఫిదా అవుతుంటారు. ఈ నేపథ్యంలో తారక్ ను సినిమాలో ఎలా చూపిస్తారో అన్న ఆసక్తి అందరిలోనూ కనిపిస్తోంది.

ఇక చిత్రంలో ఎన్టీఆర్ సరసన కన్నడ నటి రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తోంది. కీలక పాత్రలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కని పించ ను న్నా రు. సంగీత బాధ్యతలు రవి బస్రూర్ నిర్వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఆ సినిమా నుంచి ఎన్టీఆర్ పుట్టిన రోజు సంద ర్భంగా మే 20 న ఫస్ట్ లుక్ టీజర్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మొత్తానికి, తారక్-నీల్ కాం బోలో వస్తున్న ప్రాజె క్ట్ పై రోజు రోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి.



## ముంబై ఇండియన్స్ జట్టులో విభేదాలు.. స్టేడియంలోనే హార్ధిక్ Vs బుమ్రా మధ్య గొడవ




ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026లో ఐదు సార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ కి ఈ సీజన్ లో ఏది కలిసిరావడం లేదు. గురువారం నాడు వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 7 వికెట్ల తేడాతో ముంబై ఘెర పరాజయం పాలైంది. ముంబై ఇండియన్స్ కి ఇది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. ముంబై పాయింట్ల పట్టికలో 8వ రెండో స్థానంలో కొనసాగుతోంది. కాగా వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్న ముంబై జట్టులో అంతర్గత విభేదాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్లో కెప్టెన్ హార్ధిక్ పాండ్యా- స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా మధ్య జరిగిన మాటల యుద్ధం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 196 పరుగుల భారీ లక్ష్య చేధనలో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడుతూ క్రీజులో పాతుకుపోయాడు. అతడ్ని ఔట్ చేసేందుకు హార్దిక్ తీవ్రంగా ప్రయత్నించాడు. అయినప్పటికి ఫలితం మాత్రం లభించలేదు. దీంతో పాండ్యా తన సహనాన్ని కోల్పోయాడు. బుమ్రా బౌలింగ్ చేస్తున్నప్పుడు హార్దిక్ పదే పదే ఫీల్డర్లను మారుస్తూ విసిగించాడు. తన బౌలింగ్ కి తగ్గట్టుగా ఫీల్డింగ్ పెట్టుకునే ఛాన్స్ ఇవ్వకుండా, హార్దిక్ జోక్యం చేసుకోవడం బుమ్రాకు నచ్చలేదు.. హార్దిక్ పాండ్యా చేసిన ఓవరాక్షన్ అతడికి ఏమాత్రం నచ్చలేదు. దీంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది.

బుమ్రా అసహనంతో నీవు నాకు చెప్పొద్దు అన్నట్లు చేసిన సైగలు చేసినప్పటికీ, ఏదేమైనప్పటికి చివరికి కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిర్ణయానికే బుమ్రా తలవంచాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా ఈ ఏడాది ఐపీఎల్ 2026లో బుమ్రా దారుణ ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ భారత పేస్ గుర్రం ఇప్పటి వరకు 5 మ్యాచ్లు ఆడి ఒక్క వికెట్ కూడా తీయలేదు.

## టీ20 వరల్డ్ కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం.. కెనడా కెప్టెన్‌పై ఐసీసీ విచారణ!






క్రికెట్ ప్రపంచాన్ని మ్యాచ్ ఫిక్సింగ్ భూతం మరోసారి వణికిస్తోంది. తాజాగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. కెనడా, న్యూజిలాండ్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా కెనడా జట్టు ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించిందని, దీనిపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ విచారణ ప్రారంభించిందని ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో తన కథనంలో వెల్లడించింది.కెనడాకు చెందిన 'ది ఫిఫ్త్ ఎస్టేట్' అనే ఇన్వెస్టిగేటివ్ ప్రోగ్రామ్.. 'కరప్షన్, క్రైమ్ అండ్ క్రికెట్' పేరుతో రూపొందించిన ఒక డాక్యుమెంటరీ ఈ సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీలో చెన్నై వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌లో కెనడా జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేసిన ఒక ఓవర్‌పై ప్రధానంగా ఆరోపణలు వెల్లువెత్తాయి.ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 173 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బౌలింగ్‌కు దిగిన కెనడా పేసర్లు తొలి రెండు ఓవర్లలో 35 పరుగులు ఇచ్చారు. మూడో ఓవర్ వేసిన స్పిన్నర్ సాద్ బిన్ జాఫర్ వికెట్ తీసి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మెయిడెన్ ఓవర్ పూర్తి చేశాడు. ఇలాంటి కీలక సమయంలో ఐదో ఓవర్ వేయడానికి కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా స్వయంగా బంతిని అందుకున్నాడు. ఆ ఓవర్లో ఒక నో-బాల్, రెండు వైడ్లతో సహా ఏకంగా 15 పరుగులు సమర్పించుకున్నాడు. ఉద్దేశపూర్వకంగానే ఆ ఓవర్లో భారీగా పరుగులు ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ.కేవలం ఈ ఒక్క ఆరోపణే కాకుండా కెనడా క్రికెట్ బోర్డుపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) మరికొన్ని విచారణలు కూడా జరుపుతోంది. జాతీయ జట్టులో కొందరు ఆటగాళ్లను ఎంపిక చేయాలని కోచ్ ఖుర్రం చౌహాన్, బోర్డు సభ్యులు ఒత్తిడి చేసినట్లుగా ఉన్న ఒక ఫోన్ కాల్ ఆడియో గతంలో లీక్ అయింది. దీనిపైనా ఏసీయూ దర్యాప్తు చేస్తోంది.ఈ ఆరోపణలపై ఐసీసీ ఇంటిగ్రిటీ యూనిట్ జనరల్ మేనేజర్ ఆండ్రూ ఎఫ్‌గ్రేవ్ స్పందించారు. ఈ డాక్యుమెంటరీ విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే విచారణ దశలో ఉన్న అంశాలపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ఐసీసీ నిబంధనల ప్రకారం దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. ఈ ఆరోపణలతో కెనడా క్రికెట్ బోర్డుతో పాటు టీ20 ప్రపంచకప్ పారదర్శకతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

## శ్రేయస్ క్యాచ్‌కు సచిన్ ఫిదా.. అద్భుతమంటూ కితాబు



గత రాత్రి ముంబై ఇండియన్స్ తో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పట్టిన ఓ అద్భుతమైన క్యాచ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆ క్యాచ్‌ను, తాను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఒకటిగా అభివర్ణించాడు. కేవలం అథ్లెటిజం మాత్రమే కాదని, దాని వెనుక అద్భుతమైన అవగాహన, సమయస్ఫూర్తి ఉన్నాయని సచిన్ ప్రత్యేకంగా విశ్లేషించాడు.శ్రేయస్ అయ్యర్ క్యాచ్ గురించి సచిన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ... "బంతి వేగాన్ని, ఎత్తును అంచనా వేయడం, బౌండరీ లైన్ ఎక్కడుందో గమనించుకోవడం, దాన్ని తొక్కకుండా సరైన సమయంలో గాల్లోకి లేవడం.. ఇవన్నీ అద్భుతం. అంతటితో ఆగకుండా, గాల్లో ఉండగానే బంతిని పట్టుకుని, కిందపడేలోపు తన సహచర ఫీల్డర్‌కు అందించాడు. ఆ సమయంలో తన టీమ్‌మేట్ ఎక్కడున్నాడో కూడా కచ్చితంగా తెలిసి ఉండాలి. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది" అని వివరించారు.ఇలాంటి ఫీట్ చేయాలంటే నమ్మశక్యంకాని అవగాహన, టైమింగ్, ఫిట్‌నెస్, సంయమనం అవసరమని సచిన్ తెలిపారు. "శ్రేయస్ అయ్యర్ అన్నింటినీ కచ్చితంగా అంచనా వేశాడు. నేను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఇది కచ్చితంగా ఒకటి" అని సచిన్ కొనియాడారు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776